


# విరామం

## – అంగర వేంకట కృష్ణారావు



*1939 నుంచి 45 వరకూ జరిగిన రెండో ప్రపంచ మహాయుద్ధం మానవ జాతి మనుగడలో ఒక బృహత్తర ఘట్టం. ఈ సమరంలో రాజ్యాలు చూస్తూండగా పేక మేడల్లా కూలిపోయేయి. మహానగరాలు తిరగట్లో పప్పులా పిండైపోయేయి. మనుషులు కుంపట్లో పడ్డ చీమల్లా మాడిపోయేరు. ఆ విధ్వంసకాండ అభూతం! వర్ణనాతీతం.*

*పోతే, యిక మరి యుద్ధం వద్దనిపించిందా? మరి హింస వద్దు అనిపించిందా? ఉహుఁ యుద్ధమన్నా, హింసన్నా, జంకుపోయిందేమో...యుద్ధమే యెల్లప్పుడూ సాగేది. శాంతి ఒక "విరామం" లాంటిది.*

*ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రికలో ధారావాహికంగా వెలువడ్డ ఈ నవల్లో అడుగడుగునా "నేను" వున్నా ఇది కేవలం నా వూహ కాదు. ఈ ప్రదేశాలు నా కళ్ళతో చూసినవి. అయితే, రచనకి కల్పన అవసరం. ఇందులో కల్పన 'అంత మాత్రమే' వుంది.*

అంగర వెంకట కృష్ణారావు

*ఒక చిన్న మాట!*

*ఇటీవల తెలుగులో వస్తున్న నవలలన్నీ అపౌరుషేయాలు. భబానీ భట్టాచార్య బెంగాల్ క్షామం గురించి వ్రాసిన 'సోమెనీ హంగర్స్' తో తులతూగ గల మొట్టమొదటియుద్ధ దుష్ఫలితాల నభివ్యక్తం చేసే నవల తెలుగులో 'విరామం' అంటే ఎవరూ ఆశ్చర్యపోనక్కరలేదు. సాంస్కృతిక జీవనం పూర్తిగా స్తంభించిపోయి, అన్ని కళలూ, శాస్త్రాలూ, సర్వమూ సినిమాకు, రాజకీయాలకూ దాస్యం చేస్తున్న ఈ రోజులలో, శక్తిమంతమైన రచనలు రావటానికి ఉన్న అవకాశాలు దాదాపు మృగ్యం. సాహిత్యంలో వచ్చే కొత్త పోకడలను పసికట్టి, ఆదరించి ప్రోత్సహించే స్థితిలో పత్రికలు, ప్రచురణకర్తలు లేకపోయినట్లయితే, ఇక ఆ దేశపు దౌర్భాగ్యం గురించి చెప్పనవసరం లేదు. మనుష్యులలో ఏ ఒక జాతిపట్లనైనా ద్వేషం ప్రకటించడం యావత్తు మానవజాతినీ ద్వేషించడం కాగలదనే జ్ఞానం కూడా లేని రచయితలున్న మన దేశంలో, సాహిత్యం కాలక్షేపానికి తప్ప మరెందుకూ పనికి రాదేమో...ఈ పై సందేహాలన్నిటికీ నివృత్తి 'విరామం' నవల. అందుచేత తెలుగు నవలా సాహిత్యంలో శ్రీ అంగర వెంకట కృష్ణారావుగారి 'విరామం' ఒక కొత్త మలుపు. బెంగాలీలో భబానీ భట్టాచార్య, బిభూతి భూషణ బందోపాధ్యాయ, మానిక్ బందోపాధ్యాయ, మలయాళంలో తక్కాళి శివశంకర పిళ్లై, తమిళంలో ఆర్.కె.నారాయణ్, కానా శివసుబ్రహ్మణ్యం వంటి రచయితల కోవలోకి చేరుతారుతెలుగులో చాసో, కె.కె., రా.వి. శాస్త్రి, అంగర వెంకట కృష్ణారావు, కాళీపట్నం రామారావులు.ఇతివృత్తం, భాష, శైలి శిల్పం, పాత్ర పోషణతో సహా అన్నింట్లోనూ 'విరామం' భారతీయ భాషలలో వచ్చే ఏ ఉత్తమ నవలకు తీసిపోదని నవినయంగా మనవి చేసుకుంటున్నాను.*

పురాణం సుబ్రహ్మణ్యశర్మ

*విజయవాడ, 24-1-1970*

*(గత సంచిక తరువాయి)*

5

**ఆ పశువుల కాపరి** కుర్రాడి విషాద ఉదంతం నన్ను చాలా రోజులు వెంటాడింది.

మూడు వారాలు కాదు, మూణ్ణెల్లు గడిచి పోయాయి. నేను కొమిల్లా వెళ్ళడం పడలేదు. పద్మని ఆమె శలవల్లో చూళ్ళేదు. ఆమె శలవైపోగానే తిరిగి కలకత్తా వెళ్ళిపోయుంటుంది. కమల్ ని పెళ్ళి చేసుకుందికామెకి ధైర్యం చాలడం లేదు. నిజానికామెకి అతని మీద గాఢమైన ప్రేముంది. కాని అతన్ని వివాహం చేసుకుని తను కలకత్తాలో స్థిరపడిపోతే యింకా యెదిగి, యెదుగుతూన్న చెల్లెళ్ళు, బొత్తిగా చిన్నవాడు తమ్ముడు, గొర్రెతోక లాంటి జీతం సంపాదిస్తున్న తండ్రి యేం కావాలి? ఇదే ఆమె ఆలోచన. ఈ ఆలోచనే నన్నూ బాధిస్తూంది. పద్మ తన విషమ పరిస్థితితో కుస్తీ పడుతూంది.

ఒక సాయంత్రం అగర్తలా వూళ్ళో హఠాత్తుగా దాసు తారసపడ్డాడు. నన్ను చూసి సలాం సాయబ్ అన్నాడు. నేనతన్ని వెంటనే పోల్చుకోలేక పోయేను. అతనే జ్ఞాపకం చేసేడు. అప్పుడు నాతో మేలా సింగు కూడా వున్నాడు. నేను అగర్తలా ఒచ్చినప్పుడు దాసు నాకు కొంత సాయం చేసేడని మేలాతో చెప్పా.

"సాబ్! మీ యూనిట్లో క్యాంటీనుందా?" దాసు అడిగాడు.

"లేదు..." అన్నాను. "మీరు అనుమతిస్తే నేను క్యాంటీను పెడతా..." నేను మెలాసింగువేపు చూశాను. "మా యూనిట్లో రెండు వందల మంది పైగా వున్నారు. పెద్ద క్యాంటీనే కావాలి, పెడతావా?" మేలా అన్నాడు.

"అలాగే సాబ్..."

"రేపు ఉదయం పదిగంటలకి అక్కడికి రా..."

మర్నాడుదయం దాసు వచ్చేడు. అతన్ని మా అడ్జటంటు కెప్టెన్ ఎలమ్ స్లీ దగ్గరికి తీసుకెళ్ళేం. అతను అనుమతించేడు. ఆ సాయంత్రం యెనిమిది గంటలకి దాసు మా యూనిట్లో క్యాంటీను పెట్టేడు. సబ్బులు, వాసన నూనెలు, బ్లేడ్లు, బూటు పాలీషు మొదలైన నిత్యవాడకం వస్తువులే కాక టీ, ఆమ్లట్లు, బన్నులు మొదలైన తినుబండారాలు కూడా సప్లై చేస్తున్నాడు.

దాసు తమాషా అయిన మనిషి. నిరాడంబరంగా వుంటాడు. తక్కువ మాట్లాడతాడు. కాని చాలా ఘటికుడు. చాంద్ పూరు నుంచి ఢాకా వరకూ అతనికి తెలియని వూరు లేదు. అతని పరిచయాలు లెక్కలేనన్ని. అతని వ్యాపారంలో వైవిధ్యం యింతా అంతా కాదు.

అతని రాకకి షిరాజ్ పూరులో యే అలజడీ జరగలేదు. వచ్చిన నాటినుంచీ అబ్దుల్ భుజంమీద చెయ్యేసి తిరిగేడు. అప్పుడప్పుడు రాత్రిళ్ళు ఆ ఊళ్ళోనే గడిపేవాడు. దాసు వ్యాపార రంగం చాలా పెద్దది. అంచేత ఏ రోజెక్కడుంటాడో యెవ్వరికీ తెలీదు.

అర్ధరాత్రి వరకూ ఒక దగ్గరున్నవాడు, తెల్లవారితే అక్కడౌపించడు."చూడు దాస్! మేం యిక్కణ్ణించి యెప్పుడు వెళ్ళిపోతామో చెప్పలేం, అంచేత కాతాలు యింత ఎక్కువగా పెరగనీకు. నీకే ప్రమాదం.''''

దాసు నవ్వేడు. నేనీ విషయం ఎడ్జటంటుతో చెప్పా. ఆ నెల జీతాల అడ్వాన్సులు ఇచ్చినప్పుడు, దాసుని కాతాపుస్తకంతో దగ్గిర కూచోబెట్టుకుని ప్రతి సిపాయిచేత బాకీ మూడొంతులిప్పించి –చెల్లు పెట్టించేను. కాని కొద్ది రోజుల్లో కాతాలు మళ్ళీ యథా ప్రకారం పెరిగేయి.

ఒకనాడు సిపాయిలు గుసగుసలాడుకుంటున్నారు. నేను వాళ్ళ దగ్గిరకెళ్లి యేమిటీ గుసగుసలని అడిగేను. అరుశయ్య అనే డ్రైవరు విరగబడి నవ్వేడు. అరుశయ్య మా యూనిటు హాస్యగాడు. ప్రతి మిలిటరీ యూనిటుకి నాటక సమాజంలోలాగే వొక హాస్య పాత్ర వుంటుంది.

"ఏం అరుశయ్యా! ఏమిటా నవ్వు?..." అన్నాను.

"పులిసార్ పులి..."

"ఎక్కడ?''''

"మీసాల కెప్టెన్ క్వార్టరు మాస్టరు బంగళాలో...రాత్రి"

"చంపేశారా?'''

మళ్ళీ నవ్వేడు.

"ఆడపులి సార్! చీర కట్టుకున్న ఆడపులి.."

"ఓహ్...'''నాకర్థమైంది.

దాసు క్యాంటీను పెట్టిందగ్గర్నించి రాత్రిళ్ళు క్యాంపులోకి ఆడ పులులొస్తున్నాయి...." అరుశయ్య అన్నాడు.

అంతా గొల్లున నవ్వేరు.

అబ్దుల్ నాలుగో భార్య సల్మాకి పందొమ్మిదేళ్ళుంటాయి. చాలా అందంగా ఉంటుంది. కాని సరైన తిండిలేక చిక్కింది.

సల్మా అప్పుడప్పుడు చెరువుకి నీళ్ళకొచ్చేది. కోతిమూకలాంటి సిపాయిలందరూ ఆ చెర్లోనే స్నానం చేసేవారు. మలయాళ సిపాయిల్లో గజీతగాళ్ళున్నారు. నీట్లో చేపల్లా ఈదుతూ రకరకాల విద్దెలు చేసేవారు, పాటలు పాడేవారు. సల్మా చెరువు కొచ్చినప్పుడు సకిలింపులూ, యికిలింపులు చేసేవాళ్ళు. ఒక్కొక్కప్పుడు సల్మా మీద నీళ్లు చిమ్మడం, వెంటపడ్డం చేసేవాళ్ళు. అప్పుడప్పుడు వాళ్ళ నీటివిద్దెలు, వికారాలు ముచ్చటగా చూస్తూ ఆమె కూడా నీళ్ళ సంగతి మర్చిపోయి గట్టుదగ్గర నిలబడిపోడం కద్దు. అలాంటప్పుడు వాళ్ళు మరీ వికారాలు చేసేవాళ్ళు. ఏదైనా గల్లంతు జరిగినప్పుడు అబ్దుల్ నాతో దీనంగా, తీవ్రంగా చెప్పుకునేవాడు. అతని ముఖకవళికలుపట్టి సంగతి గ్రహించి సిపాయిల్ని మందలించే వాణ్ని.

అప్పుడప్పుడు మా యూనిటుకి చెందిన తెల్ల సోల్జర్లలో కొందరు రాత్రివేళ ఆ గ్రామంలోకి జొరబడేవారు. కొంత అలజడి జరిగేది. కాని ఏదోవిధంగా అలాంటి తగాయిదాలు పరిష్కారమయేవి.

ఆకలి మనిషిని ఎంత హీనదశకైనా క్రుంగ దీస్తుంది. సమయం కని పెట్టి పనిచేసేవాడు దాసు. అతడల్లిన సాలెగూట్లోకి పరిస్థితుల ప్రభావం వల్ల కొన్ని యీగలు జొరబడి చిక్కుకు పోయేవి. అందుకే రాత్రిళ్ళు మా క్యాంపులోకి పులులొస్తున్నాయని సిపాయిలు హేళనగా అనేవాళ్ళు.

ఒక సాయంత్రం నేను చెరువుకి స్నానానికి వెళుతున్నా. అబ్దుల్ కాలిబాట పక్కని రాతి మీద దిగాలుగా కూచున్నాడు. నేను దగ్గరికి రాగానే తలెత్తి వెర్రివాడ్లా చూసేడు. నేను నవ్వుతూ పలకరించేను. అతను లేచి నడ్డిమీద చేతులు పెట్టుకొని ఏదో గొణిగేడు. అతనికి మాట పెకల్దం లేదు, కళ్ళంట నీళ్ళొస్తున్నాయి. ఏదో అంటాడు. నాకర్థం కాదు. వలవల ఏడుస్తున్నాడు. నాకర్థం కాలేదు కాని యేదో విపత్తు జరిగిందని గ్రహించేను. అతను నా చెయ్యి పట్టుకుని యింటివైపు తీసుకెళ్ళేడు.

మేం గుమ్మం దగ్గర కెళ్ళగానే, అతని భార్యలు, యింకా చుట్టుపక్కల వాళ్ళు గుమి గూడి యేదో చెప్తున్నారు. మధ్య మధ్య "సల్మా" అన్నమాట వినిపిస్తూంది. కానియేం జరిగిందో తెలీదు. సల్మా యెక్కడుందని నేను సగం వాచికం, సగం అభినయంతో అడిగేను. అబ్దుల్ యిక దుఃఖం ఆపుకోలేకపోయాడు. గదిలోంచి ఒక చిరిగిపోయిన చీర తెచ్చి చూపించేడు.దాని మీద నెత్తురు మరకలున్నాయి. నాకు అది చూస్తే మరీ అయోమయంగా వుంది. ఇంతలో అక్కడికి దాసు వచ్చేడు.

“దాసూ! సల్మాకేమైంది? వీళ్లంతా ఏమంటున్నారు? అబ్దులుకి ఏం ఆపదొచ్చింది?” అని అడిగాను.

“సాబ్! నిన్న సాయంత్రం నుండీ సల్మా కనిపించడంలేదు. రాత్రి గొడవపడ్డాం. లాంతర్లు, కర్రలు పట్టుకుని చుట్టుపక్కల అడివంతా వెతికేం. ఎక్కడా జాడలేదు....”

“కన్నవారింటికి వెళ్ళిందేమో...”

“దానికి కన్నవారెవరూ లేరు. వెతగ్గా వెతగ్గా దూరంగా డొంకల్లో సల్మా చీర కనబడింది. చీర చిరిగిపోయింది, రక్తం మరకలున్నాయి. అదుగో ఆ చీరే. పులెత్తుకు పోయిందన్న మాట. పాపం సల్మా చచ్చిపోయింది. కాని శవం కనపళ్లేదు...”

నాకు చమట పోసింది. “హే రామ్” అనుకున్నా. అబ్దుల్ మొహంలోకి చూడగానే నా కళ్ళు కూడా చమర్చేయి, సల్మా సవితులతో పాటు ఊరంతా గోలుగోలున యేడ్చేరు. దాసు వాళ్ళనోదార్చేడు.

నేను చెరువ్వేపు నడుస్తూ అనుకొన్నాను – సంజపడ్డాక యిలా ఒంటరిగా తిరిగితే, యెప్పుడో నన్ను కూడా పులెత్తుకుపోతుంది.

రెండు మూడు వారాలు పోయిన తరవాత వోనాడు మేలాసింగు ఏదైనా ఊరు వెళదాం అన్నాడు. నేను అర్థోక్తిగా యేం కథ అన్నా.

"అబ్బే, మరేం లేదు. నాదంతం ఒకటి పుచ్చిపోయింది. అది ముందు తీయించాలి. తరువాత వీలు చూసుకుని కొత్త దంతం కట్టించుకోవాలి. అందుకొక డెంటిస్టు దగ్గర కెళ్లాలి." దాసుని పిలిచేం.

"ఈ చుట్టుపక్కల ఏదైనా చూడదగిన వూరుందా?" అని అడిగాను.

"దూరంనా, దగ్గర్లోనా?"

"ఇరవై ముప్పై మైళ్ళలో..."

"బ్రహ్మంబరియా వుంది. పాతిక మైళ్ళు. చిన్న వూరు. కాని మీరక్కడ ఏంచూస్తారు?"

"ఊరు చూస్తాం..."' ప్రభూ అన్నాడు.

"ఎక్కడా కూచోం" అని నేనన్నా.

దాసు నవ్వి "అచ్ఛా సాయబ్"అన్నాడు.

"ఆ వూళ్లో దంత వైద్యుడున్నాడా? నా పన్ను తీయించుకోవాలి..."

"ఉంటాడు సాయబ్, గుర్తులేదు."

మర్నాడాదివారం, మేం ముగ్గురం, దాసూ బైల్దేరేం. ఉదయం పది గంటలకి బ్రహ్మంబరియా చేరాం. బాగా యెండగా వుంది.

బ్రహ్మంబరియా చిన్న పట్నం. సుమారు పాతిక వేలు జనాభా వుంటుంది. మంచి హోటళ్ళు లేవు. ఉన్నవేవో పరిశుభ్రతకి బారెడు దూరంలో వున్నాయి. ఇడ్లీ, దోశ ఆ ప్రపంచంలోనివి కావు. కనీసం కారపూప్స, కారబ్బూంది అయినా లేవు. ఏవేవో తీపి పదార్థాలున్నాయి, అవి మా ముగ్గురికీ దిగవు. దాసు ఏమీ తిననన్నాడు. మేం టీ తాగేం.

ఆ వూళ్ళో సైను బోర్డులన్నీ ఒక్క బెంగాలీ భాషలోనే వున్నాయి. ఇంగ్లీషు మచ్చుకైనాలేదు. పళ్ళ డాక్టర్ని పట్టడం కష్టమైంది. భాష ఏదైనా పళ్ళ డాక్టరు ఆస్పత్రిముందు సాధారణంగా పళ్ళనోరు, బోసినోరు బొమ్మలుంటాయి.

ఇక్కడ అవీలేవు, పళ్ళ డాక్టరుకోసం తిరిగే సరికి మా కాళ్ళరిగిపోయాయి. తిరిగి తిరిగి పన్నెండు గంటలకెలాగో ఓ పళ్ళ డాక్టర్ని పట్టేం. పది రూపాయిలిచ్చి మేలా పన్నూడ గొట్టించుకున్నాడు. మళ్ళీ హోటల్లో యేదో తిని, టీ తాగి ఊరు చూడ్డానికి బైల్దేరేం.

బ్రహ్మంబరియా జనాభాలో మాకు ముస్లింలే ఎక్కువ కనిపించారు.

మాకు అక్కడ అన్నిటికన్న ఒక్కటి కొట్టొచ్చినట్టు కనిపించింది. ముష్టివాళ్ళు, జబ్బువాళ్ళు, అస్తిపంజరంలా వున్నవాళ్ళు ప్రతి చోటా వున్నారు. ఇలాంటి వాళ్ళు అత్యధిక సంఖ్యలో వున్నా వాళ్ళనెవరూ గమనించినట్టు లేదు. గమనించలేరు కూడా.

నల్ల బజారు రాజ్యం యేలుతున్న ఆ ప్రదేశంలో ప్రతి మనిషికి బతుకు ఒక చావులా వుంది. వాళ్ళచుట్టూ ఊగిసలాడుతూన్న మిలిటరీ వాతావరణం. శవదహనం జరుగుతూంటే పొగలు రేగే శ్మశాన వాతావరణంలా వుంది.

అక్కడ హిందూ, మహమ్మదీయ భేదం కనిపించలేదు. వర్తకులెందరో ముస్లిములు, అంతా ఒకే భాష మాట్లాడతారు. అంతా ఒకేలాంటి తిండి తింటారు. అందరిదీ ఒకే ఆశ– బతకాలని, అందరిదీ ఒకే సమస్య– ఎలా బతకాలని.

మన దేశాన్ని వ్యాపారస్తులు, అధికార మదం కలవాళ్లూ, స్వాతంత్ర్యానికి ముందే, అంటే ఈ యుద్ధ సమయంలోనే హస్తగతం చేసుకున్నారు. నిత్యవిలాసం, నిరు పేదరికం, ఈ రెంటి సహజీవనం ఆనాడే ఆరంభమైంది.

స్త్రీలు శరీరం అమ్ముకుని పొట్టపోసుకునే బజారు బ్రహ్మంబరియాలో చాలా పెద్దదుంది. అక్కడ ఓ మాదిరి వెడల్పయిన వీథులు మొదలుకొని, పద్మ వ్యూహంలాంటి సందులు గొందెల వరకూ వున్నాయి. ఆ వ్యాపారస్తులకి పాటరాదు, ఆటరాదు. వాళ్ళ వ్యాపారానికి వాళ్ళ శరీరాలే మదుపు. ఈ వ్యాపారం చేస్తూ, శరీరం, ప్రాణం వేరైపోకుండా చూసుకుంటారు.

అక్కడున్న వాళ్ళలో నూటికి తొంభై పాళ్లు ఆకలికి తట్టుకోలేక వ్యాపారానికి దిగినవాళ్ళే. వాళ్ళు పూర్వాశ్రమంలో కలకల్లాడే కుటుంబాల్లో, ముద్దుగా, ముచ్చటగా, మురిపెంగా, గౌరవంగా, గర్వంగా వున్న భార్యలు, తల్లులు, కూతుర్లు, అక్కలు, చెల్లెళ్ళు, రోజుల తరబడి నిట్రుపవాసాలు చేసి, శరీరం తూలిపోయి, కళ్ళు పచ్చబడిపోయి, స్వంత బాధ కన్న, తల్లిదండ్రుల, తోబుట్టువుల, భర్తల, నోరులేని పసిపిల్లల ఆకలిచావులు చూళ్ళేక, కుటుంబ జీవనం నరకంలా తోచి, భవిష్యత్ జీవితపు చీకటింటి అంధకారంలో ఒక సన్నటి వెలుగురేఖ కూడా కనిపించక, గుండెలు బద్దలై అక్కడినించి పారిపోయి, యిక్కడికి వచ్చేరు. వీళ్ళకి సిగ్గూ శరం లేవు. తాగడానికి మద్యం, తినడానికి మాంసంతో కూడిన ఆహారం కావాలి. తాగుతూ తింటూంటే అచ్చంగా చచ్చిపోయిన జంతువుల్లా వుంటారు. కుళ్ళి కంపుకొడుతూన్న శవం తనమీద ఒకేసారి పది పన్నెండు రాబందులుపడి నాలుగు పక్కల్నించీ పీక్కుతింటూంటే యేం ఖాతరు చేస్తుంది! వీళ్లూ అచ్చంగా అంతే.

అక్కడ ఒక యింట్లో నాకు''సల్మా''కనపడింది. విశాలమైనస్థలం. ఎటుచూసినా ఆకుపచ్చని ప్రకృతి, చెరువు, అంతులేని ఆకాశం. ఆ పులకించిన ప్రకృతిలో మెరుపు తీగెలా వుండే సల్మాకీ, ఇక్కడ ఈ గొందెలో, కాలవల దుర్గంధంలో – మరుగుదొడ్డి లాంటి బల్ల చెక్కల చీకటి యిరుకుగదిలో వున్న సల్మాకీ యెంత తేడా!

పశువుల కాపరి కుర్రాణ్ణి ఆకలిగొన్న పులి తినేసింది. సల్మాని ఆకలి పులి తినేసింది. అంతే తేడా.

సల్మాకి ఈ పులి గుహలోకి దారి చూపింది దాసు.

దాసు మాతో తిరిగిరాలేదు. అక్కణ్నించి ఢాకా వేపున్న ఖైరాబ్ బజారు వెళ్ళేడు. తనకక్కడ రాచకార్యాలున్నాయన్నాడు. మేం తిరిగి క్యాంపు కొచ్చే సరికి చీకటి పడుతూంది.

నేను చెరువుకి బయల్దేరాను. తోవలో అబ్దుల్ కనిపించాడు. అతణ్ని చూస్తే నాకు జాలి వేసింది. అతనికి సల్మా నిజంగా ఏమైందో తెలియదు. పులివాత పడిందనే అనుకుంటున్నాడు. నేను నిజం చెప్పలేదు. చెప్పి ప్రయోజనం లేదు. సల్మా అదృశ్యమైన తరువాత పోలీసు దర్యాప్తు జరిగింది. పోలీసులు కూడా సల్మాని పులెత్తుకు పోయిందనే రిపోర్టు పంపారు.

మా వర్కుషాపు అప్పటికింకా ఆర్.హెచ్.క్యూ తో వేరుపడలేదు. పగలంతా ఆఫీసు పని, సాయంత్రం షికార్లు, రాత్రి నిద్ర, మా నెత్తి మీద ఆకాశంలో ఎప్పుడు విమానాలు హోరు పెడుతూ తిరుగుతుండేవి. రాత్రి, పగలు విరామం లేదు. శత్రు విమానాలు (అంటే జపానీయులవి) ప్రతి రోజూ మా మీంచి ఎగురుతుండేవి. ఎప్పుడూ గుంపులుగా వచ్చేవి కావు. రెండు మూడు చొప్పున వచ్చేవి. అదికూడా వేరువేరు దిక్కుల్నించి. సాధారణంగా మిట్టమధ్యాహ్నం వచ్చేవి. కంటికి కనిపించీ కనిపించనంత ఎత్తున ఎగిరేవి. మండుటెండలో వెండితునకల్లా మెరుస్తూ పల్టీలు కొడుతూ మహావేగంతో వచ్చేవి. వెంటనే సైరన్ల అరుపులు విమాన విధ్వంసక శతఘ్నుల మోతలు, వాటి ప్రేలుడు వల్ల ఆకాశం మీద పడిన తెల్లటి మచ్చలు అగుపించేవి.

సాధారణంగా శత్రు విమానాలు వచ్చినపని ముగించుకుని, వెంటనే వచ్చినప్పటి కంటే రెట్టింపు వేగంతో పారిపోయేవి. ఒక్కొక్కప్పుడు ఒకే విమానాన్ని ఇరవై శతఘ్నులు అన్ని దిక్కుల్నించీ అభిమన్యుణ్ణి కౌరవ సేనలా ముట్టడించేవి. ఆ అభిమన్యుడు దొరికిపోయేడు. కాని వీడు దొరికేవాడు కాదు. గెద్దవాటుగా విమానాన్ని చివాల్న కిందికి దింపి, శతఘ్నిస్థావరం మీద, యింకా శతఘ్ని నెత్తి మీద బాంబు పేల్చి, తిరిగి గెద్దలా సర్రున విమానాన్ని అంతరిక్షంలోకి తీసుకు పోవడంలో జపాను వాళ్ళు సాటిలేనివాళ్ళు.

“ఆల్ క్లియర్” అవగానే మాకు “ఎబుల్” “బేకర్” “చార్లీ" ("A" "B" "C") బ్యాటరీలకి, శతఘ్ని స్థావరాలకీ మధ్య సంభాషణలతో టెలిఫోను తీగలు తెగిపోయినంత పని అయ్యేది. తరవాత కొంత సేపటికంతా సద్దు మణిగినా తిరిగి కందిరీగ అరుపులా నిదానంగా గస్తీ విమానాలు మోత. అది అనంతం.

మాకు తిండికీ, బట్టకీ కొదవలేదు. విలాస వస్తువులకీ, సిగరెట్లకి, తాగుడు పదార్థాలకి కరువులేదు సరేకదా, అవెప్పుడూ కోకొల్లలు. ధర్మరాజు రాజసూయయాగం తల పెడితే, అతని నలుగురు తమ్ముళ్లూ ఆసేతు శీతాచల పర్యంతం వున్న దేశాల రాజుల్నందర్నీ చావగొట్టి ధనకనక వస్తు వాహనాల్ని మోసుకొచ్చి అన్నయ్య ముందు పడేశారు. ఈ మానవ

మారణ యాగంలో కూడా అదే తంతు జరిగింది. రాయల్ ఇండియన్ ఆర్మీ సప్లై కోర్ వాళ్లు తమ కబంధహస్తాలతో దేశాన్ని గాలించి అన్ని రకాల సరుకులూ, రాసులూ, మేటులూ తరుగులేకుండా తెచ్చిపడేస్తున్నారు. ఉప్పుతో తొమ్మిది దినుసులు కాకుండా తొంభై తొమ్మిది దినుసులు, దిమ్మా తిరగా వుండేవి.వీటిలో మూడొంతులు అంచీ అంచీనా తిరిగి చీకటి బజార్లోకి వెళ్లేవి.

పూర్వం చీకటి తప్పంటే ఒకటే–ఇప్పుడు అనేకం. దీనివల్ల ఓడలు బళ్ళయేయి, బళ్ళోడలయేయి. ఇది అప్పుడు యుద్ధరోగం వల్ల సమాజానిక్కలిగిన తాత్కాలిక లక్షణం అనుకున్నాం. కాని యిది క్రమేణా మనిషితత్వంలోకి ప్రవేశించి ఇమిడిపోయింది.

6

మా యూనిట్లో నూటికి తొంభై మంది మద్రాసీలే. అంటే తెలుగువాళ్ళు, తమిళులు, మలయాళీలు, కన్నడిగులు, అందరూ కలసి మద్రాసీలుగా చలామణీ అయ్యేవాళ్ళు.

ఓ సారి రేషనుస్టాండు వాళ్ళు మూడు నాలుగు వారాలపాటు మాకు మినపప్పు, శనగపప్పు యిచ్చేరు. కందిపప్పివ్వలేదు. దాంతో సిపాయిల్లో గునుపులు, గుసగుసలు బైల్దేరేయి. అవి అలాఅలా అడ్జటంటు చెవిని పడ్డాయి. అతను మొదట దీన్ని అంతగా పట్టించుకోలేదు. ఓమాటు ఫిర్యాదు తెచ్చినవాళ్ళ మీద కోప్పడి, “మనం యుద్ధంలో వున్నాం, కందిపప్పు కావలసినవాళ్ళు జపాను వెళ్ళండి” అన్నాడు. కాని సిపాయిలేమీ తక్కువవాళ్ళు కాదు. మరీ గోల చేసేరు. అడ్డటంటు ఈ విషయం మా ఓసీతో చర్చించి నన్ను పిలిచేడు.

“కందిపప్పు లేదని సిపాయిలు గోల పెడుతున్నారు” అన్నాడు అడ్జటంటు.

"నిజమే, కందిపప్పు రేషను స్టాండు వాళ్ళివ్వడం లేదు. దక్షిణాదిని కందిపప్పే ముఖ్యంగా తింటారు...” అన్నాను.

“హుఁ! నువ్వేమైనా చెయ్యగలవా” అని మా ఓసీ అన్నాడు.

“రేషను స్టాండుకి వెళ్ళి చూడాలి...”

“రేపు నువ్వెందుకెళ్ళకూడదు?”

“అలాగే...”

మర్నాడుదయం ఆరుగంటలకి రేషనుట్రక్కు నా బాషాముందాగింది. నేను "టీ, చపాతీ” ముగించి బైల్దేరా..

ట్రక్కు అడివి కచ్చారోడ్లమీద మెలికలు తిరుగుతూ వెళిపోతూంది. అక్కడ పచ్చని అడవి అందం తాండవిస్తూంది. వర్షాలెక్కువగా కురిసి గుంటలు, చెరువులు పూర్తిగా నిండేయి. నేల సారవంతమైంది. కాని సాగుచేసి పండించడానికి సౌకర్యాలు లేవు. చదువుసంధ్యల్లేక, జీవనోపాధిలేక, బక్కచిక్కిన ఆ మనుషులు నిస్సహాయంగా వున్నారు.

అది త్రిపురా సంస్థానం. పూర్వం త్రిపురాసురు డిక్కడే వుండేవాడేమో. ఇప్పుడిక్కడున్న పచ్చదనం, వెచ్చదనం చూస్తే పురాణకాలంలో శంకరుడి మూడోకన్నులోంచి వచ్చిన మంటలకి కాలి బూడిదైనదీ స్థలమేనా అనిపించింది.

నా ట్రక్కు యేడెనిమిది మైళ్ళు ప్రయాణం చేసి రేషను స్టాండు చేరింది. నేనంతకు ముందు అక్కడికి వెళ్ళలేదు.

అక్కడ అప్పుడే సుమారు మూడువందల ట్రక్కులున్నాయి. అవిగాక రేషను స్టాండుకి చెందిన లారీలున్నాయి. అక్కడ చూస్తే ధర్మరాజు రాజసూయం చేసినప్పుడు కూడా అంత రేషను సమకూర్చుకుని వుండడనిపించింది.

బియ్యం, గోధుమలు, పప్పులు, పాలు, పాలపొడి, వెన్న, జామ్, మార్మలేడ్, చీజ్, డెక్కలమీద వున్న మాంసం (Meat on Hoof), తాజా మాంసం, టిన్ను మాంసం, చేపలు, బిస్కట్లు, రొట్టె, నూనె, నెయ్యి, తాజా కూరలు, యెండు కూరలు, టీ, ఐసు యింకా యింకా సమస్తం వున్నాయి. ఆ ఆహార గోడౌన్ల సైజు, వాటిలో వున్న సరుకుల బృహత్ పరిమాణం చూసి నేను మొదట గొప్ప గాభరా పడిపోయేను. తరువాతతెలివొచ్చి ముక్కు మీద వేలేసుకున్నా. అతి విశాలంగా యెత్తుగా వున్న ఒక్కొక్క గోడౌనులో కెళ్ళి, వాటిలో పేర్చిన వేల సంఖ్య బస్తాలు చూస్తుంటే నామటుకు నేనొక చీమలా తోచేను.

ఈ యుద్ధం సమయంలో దేశం మొత్తం మీద యిలాంటి రేషన్ స్టాండు లెన్నున్నాయి? హిమాలయ పరిమాణంలో యెక్కణ్ణించొస్తూందీ సరుకు? ఎక్కడెక్కడికి పంపిణీ ఔతూంది? ఎవరి పొట్టల్లో కెళుతూంది?

శలవల్లో మా వూరు వెళ్ళినప్పుడల్లా అక్కడ పరిస్థితి చూశా. ఆ పరిస్థితే దేశం అంతటా వుంది. సామాన్య ప్రజలకి వెన్న, జామ్, మార్మలేడ్ లక్కర్లేదు. తోడేల్ని దూరంగా వుంచడానికింత అన్నం కావాలి. పసిపిల్లలకి పాలల్లోకి చెంచాడు పంచదార కావాలి. ఏదో గుడ్డి వెలుగుకోసం ఒక అరసీసా కిరసనాయిలు కావాలి. నగ్నత్వం దాచుకుందికి మూరెడు బట్ట కావాలి. వీటికే వచ్చిన యిబ్బందల్లా.

ఆ రేషను స్టాండులో పనిచేసేవాళ్ళు, కాంట్రాక్టర్లూ పందికొక్కుల్లా వున్నారు. దుమ్ముల గొండెల్లా నవ్వుతున్నారు. అక్కడుండే వాచ్ మనుల దగ్గరకూడా రేషను కోసం వచ్చే పెద్ద పెద్ద ఆఫీసర్లు సైతం వినయంగా ప్రవర్తిస్తున్నారు.

కాంట్రాక్టర్లు గింజ గింజా అధిక ధర్లకి సేకరించి, ప్రజల నోట్లో మన్నుకొట్టి, మిలిటరీ సప్లయిలు ధారాళంగా చేస్తున్నారు. సప్లయి చేసిన సరుకులో సగం రేషను స్టాండు సిబ్బంది తిరిగి చీకటి బజారులోకి పంపించి వేలు, లక్షలు గడించి, జీవితం విలాసంగా గడుపుతున్నారు. మిగిలిన సగంలో మూడొంతులు నిర్లక్ష్యం వల్ల దండుగౌతుంది. ఆ మిగిలింది కాస్తా పటాలాల సిబ్బందికి సరఫరా అవుతుంది. అక్కడ వేలాది సామాన్య ప్రజ పిడికెడు బియ్యం, పట్టెడన్నం లేక రోజుల తరబడి వుపోషాలు చేసి ఆకలిచావులు చస్తున్నారు.

ఈ ఆలోచనల్లోంచి బయట పడేసరికి నాకు కందిపప్పు జ్ఞాపకం వచ్చింది. కందిపప్పు ఎక్కడ దొరుకుతుంది? అదే సమస్య.

"రేషను సప్లయి గురించి ఎవర్ని భోగట్టా చెయ్యాలి?" అక్కడ తిరుగుతున్న ఒక కెప్టెన్ని భోగట్టా చేశా. అతను చిరునవ్వు నవ్వేరు కొంటెగా.

"అటు చూడు అదిగో ఆ గదిలో ఒక హవల్దారున్నాడు. అతణ్ణి కలుసుకో..."

నేను గది దగ్గిర కెళ్ళి క్షణం జంకుతూ గుమ్మంలో నించున్నా. అందులో యేకల్నలో, మేజరో కూడా వుండొచ్చని. కాని అదేంకాదు. అసలే అది మరీచిన్న గది. అందులో వొక చిన్న బల్లముందు కుర్చీలో ఒకడు కూచున్నాడు. తలొంచుకుని రాసుకుంటున్నాడు. నేను పరికించి చూసేను.

"కమల్... మీరా...?"

అతను తలెత్తి చూసేడు. నవ్వేడు.

నా తలలో ఆలోచనలు రైలు పెట్టెల్లాదొర్లి పోతున్నాయి.

"ఏం యిలా వచ్చేరు?" కమల్ లేస్తూ ప్రశ్నించేడు.

"అబ్బే మరేం లేదు. మా యూనిటుకి కందిపప్పు సప్లై చెయ్యడం లేదు. సిపాయిలంతా గోల చేస్తున్నారు. అంచేత ఓసారి స్వయంగా రేషను స్టాండుకి వెళ్ళి ప్రయత్నిద్దామని వచ్చా. ఇక్కడ మిమ్మల్ని కలియడం చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది..."

కమల్ "ష్" అని ముక్కుమీద వేలేసి "పదండి" అన్నాడు. బైట సిగరెట్టు కాలుస్తున్న ఆర్డర్లీని పిల్చి ఆఫీసులో వుండమన్నాడు. ఆ ఆఫీసుకి కమల్ ఒక్కడే సిబ్బంది. సర్వాధికారి. రేషను యిచ్చే తంతులో చివరి ఘట్టం అతని ఆఫీసు. అంటే గరిటె అతని చేతులో వుందన్న మాట.

ఆఫీసు గదిపక్కనే అతని బాషావుంది, అది విశాలంగా వుంది. కాని యేమంత నీటుగా లేదు. రెండుమూడు కుర్చీలు, వొకబల్ల వున్నాయి. బట్టలు ఎలాబడితే అలా తాళ్ళమీద వేళ్ళాడుతున్నాయి. గోడకి తలుపులేని ఒక అల్మారావుంది. దాంట్లో ఓవల్ టీన్, కోకో, వెన్న, జామ్, మార్మలేడు మొదలైన టిన్నులున్నాయి. మేం కూచోగానే అతను పృథ్విలాల్ అని అరిచేడు. 'జీ సాబ్' అంటూ పృథ్విలాల్ వచ్చేడు. "రెండు కప్పులు ఓవల్ టీను కలిపి తీసుకురా!" అన్నాడు కమల్.

ఓవల్‌ను తాగుతున్నంత సేపూ మేం మౌనంగా వున్నాం; కాని, నా ఆలోచనలకి అంతులేదు.

కమల్ మిలిటరీలో యెందుకు చేరేడు? ఎప్పుడు చేరేడు. అసలతనికి యుద్ధం అంటే కిట్టదే. ఆగర్భ శ్రీమంతుడికేమిటీ అవస్థ? అతణ్ణి కిందటిసారి చూసి సుమారు సంవత్సరం కావస్తూంది! అతను ఎడ తెగకుండా మాట్లాడేవాడు. ఎందుకో అందుకు పదే పదే నవ్వుతూ నవ్విస్తూండేవాడు! ఇప్పుడేమిటీ విపరీతం? ఇతను ఆ కమల్ కాడేమో? కాకపోతే నేనెలా పోలుస్తాను? నా కళ్ళు నన్నంత మోసం చేస్తాయా? అసలు అతను నన్నెలా గుర్తుపడతాడు?

పద్మ యెలావుంది? ఆమె తండ్రి, చెల్లెళ్ళు, తమ్ముడూ బావున్నారా? ఎన్నో ఆలోచనలు, ఎన్నో అపోహలు. అతనికొక సిగరెట్టిచ్చి, నేనోటి ముట్టించా.

"కమల్..."

"ష్ నా పేరు కమల్ కాదు, రాయ్! నన్నిక మీద అలాగే పిలవండి..."

నాకు అంతుపట్టలేదు.

రాయ్! ఇతను రాయా? మారు పేరు! నేను విడని చిక్కులో సతమతమౌతున్నా. అతను తలుపు దగ్గిరగా వేసివచ్చాడు. "చూడండి రావ్ జీ! మిమ్మల్ని అట్టే సేపు సందేహంలో వుంచను. నా పేరు రాయ్... ప్రసన్న కుమార్ రాయ్.... హవల్దార్ రాయ్"

"నాకేం అర్థం కాడం లేదు..."

"అదే నాకు కావాలి... నా గురించి సరిగా అర్థం కాకూడదు. పై వాళ్ళకి అర్థమైతేనే నాకు ప్రమాదం. కాని నాకందుకు భయంలేదు, పద్మకేమైనా ప్రమాదం కలిగితే నేను భరించలేను" కమల్ గుండె బిగువుతో అన్నాడు.

పద్మ! పద్మ! అయితే యితను కమలే. నా సందేహం తీరింది.

"మిస్టర్ కమల్... సారీ రాయ్? మీరు నిస్సందేహంగా మీరే. కాని నేను నేనే అని మీరెందుకు బైటపడ్డంలేదో నాకర్థం కాదు. పద్మ కులాసాగా వుందా...?"

"కులాసా? పద్మ ఎలా వుందో తెలీదు. నా విషయం చెప్తా. కాని యిది గొప్ప రహస్యం. యిది మీరెవ్వరికీ చెప్పకూడదు... ప్రామిస్?"

"ప్రామిస్" చేతిలో చెయ్యివేశా. అతనేం చెప్తాడో అని గుండె వేగంగా కొట్టుకుంటూంది.

అతను తలుపు వేపు మరోసారి చూసేడు. బైట లారీలు గుర్రు గుర్రు మంటున్నాయి. మనుషుల పిలుపులు, నవ్వులు, ఈలలు గోలగా వుంది.

"చూడండి, ప్రామిస్సేనా?"కంగించేడు.

"ముమ్మాటికీ ప్రామిస్. మీ రహస్యం నాబొందిలో ప్రాణం వుండగా బైట పెట్టను; సరా!"

అతనొక క్షణం తీవ్రంగా ఆలోచించి, చివరికి మొదలెట్టేడు అసలు సంగతి.

"నేనొక మనిషిని చంపా..."

కరెంటు దెబ్బతిన్నట్లయింది నాకు.

"ఎవర్ని?"

అతను తలెత్తకుండా క్షణం నడికొప్పువేపు చూసేడు. తిరిగి నా వేపు చూసేడు. అతని విశాలమైన తెల్లగుడ్లమీద యెర్రచారలు మరీ యెరుపెక్కేయి.

"ఫిష్ పూల్... మా మేడకింది భాగంలో వున్న ఆర్టిలరీ బ్రిగేడు ఆఫీసు సూపరెంటు..."

"కారణం?"

అతను మళ్ళీ తలెత్తకుండా నడికొప్పువేపు చూసేడు. "ఆ సన్నగా, పొడుగ్గా, తోడేల్లా, "ఇయాగో" లా వుండే వెధవ పద్మ మానాన్ని భగ్నం చేసేడు. ఆ తుక్కు వెధవకి గులాబీ పువ్వేదో, వుమ్మెత్త పువ్వేదో తెలీదు..."

అసలదెలా సంభవించిందో!. పద్మ చాలా జాగ్రత్తయిన పిల్లే...

"కుట్ర– పెద్ద కుట్ర! వాడితో మరో యిద్దరు వాకైలు కూడి ఈ అత్యాచారం సాగించేరు. ఒక శనివారం సాయంత్రం పద్మ రానంటున్నా మొహమాటం పెట్టి ఊళ్ళోకి తీసుకెళ్ళేరు. అక్కడొక అనువైన హోటల్లోకి తీసుకెళ్ళేరు. ఆ హోటలు గదిలో వాళ్ళ పన్నాగం సాగించేరు..."

"మీకీ విషయం యెప్పుడు తెలిసింది?"

"పద్మ వెళిపోయిన పది రోజుల తర్వాత..."

"ఎక్కడికి వెళ్ళిపోయింది?"

"వాళ్ళ ఊరు కొమిల్లా. తీరని పరిస్థితులు కారణంగా చూపించి ఉద్యోగం నించి విడుదల పొందింది. నేనప్పుడూళ్ళో లేను. వెళిపోతూ నాకిమ్మని, వొక వుత్తరం అమ్మకిచ్చింది. అది చదువుతూంటే నారక్తం పెట్రోలులా మండింది. నక్క వెధవ ఫిష్ పూల్ని భారతదేశం మట్టిదాటి పోనివ్వకూడదనుకొన్నా. వాణ్ని నేనొక హోటలుకి తీసుకెళ్ళా. అక్కడ బాగా తాగించా. తాగి తూలుతున్న వాడి గొంతు ముడి విరిచి హతమార్చా. వాడు గుడ్లు తేలేస్తూంటే "పద్మని తల్చుకోరా. మోక్షమన్నా వస్తుంది." అని జోడు కాలుతో వాడి మొహం మీద నాలుగు తన్నా. హోటలు బైటకొచ్చి తిన్నగా ఢాకా పారిపోయా. అక్కడ మిలిట్రీలో భర్తీ అయిపోయా. అంబాలాలో మూడు వారాలు ట్రెయినింగై యిక్కడికొచ్చా...."

"మీ అమ్మగారికీ సంగతి తెలుసా?"

"తెలుసు. అంబాలా నించి ఒక వుత్తరం రాశా. అమ్మ యిప్పుడు కలకత్తాలో లేదు. కలకత్తాలో యింటిపై భాగంకూడా అద్దెకిచ్చి, అమ్మ డార్జిలింగులోనే వుంటోంది. నేనొకసారి డార్జిలింగు వెళ్ళి అమ్మదగ్గిరో రోజున్నా. అమ్మ ధైర్యంగానే వుంది. నాకంతకన్నా భయంలేదు."

"తరువాత పద్మని కలిసేరా?"

"లేదు. ఇప్పటి వరకూ కలియలేదు."

"పద్మ యిల్లు తెలుసా?"

“ఎలా తెలుస్తుంది! ఎప్పుడైనా రానిస్తేనా, పద్మ! నా పద్మ పువ్వు లాంటిది. ఎలావుందో వెళ్ళాల్సుంది, కాని ధైర్యం చాల్దు.”

“ఫరవాలేదు. పద్మ కులాసాగానే వుంటుంది, నాకు తెలుసు. మనిద్దరం కలిసి వోరోజు వెల్దాం” అతన్ని వోదార్చేను.

ఆ నాడు లాంచీలో ప్రయాణం చేస్తున్నప్పుడే గ్రహించా, కమల్ తొందరపాటు వాడని. పద్మని అతను నిండు హృదయంతో ప్రేమించేడు. ఆమెకి జరిగిన అవమానాన్ని సహించలేకపోయాడు. తీవ్రమైన చర్య తీసుకున్నాడు.

మనిషి మనిషిని హత్యచేసేటప్పుడు అతని నెత్తురు సలసల కాగుతూంటుంది. ఆ మరుగుతున్న నెత్తురు విచక్షణా జ్ఞానాన్ని నాశనం చేస్తుంది. కొందరికి హత్యలు వృత్తి. మనిషిని చంపుతూంటే వాళ్ళ నెత్తురు వేడెక్కదు. మామూలుగానే వుంటుంది. అలాంటి హత్యనే "కోల్డు బ్లడెడ్ మర్డర్” అంటారు. బాగా ఆలోచించి నిశ్చయానికొచ్చి చేసినహత్య వంకాయ తరిగి పోపులో వేసినట్టే. కమల్ చేసిన హత్య అలాంటిది కాదు.

కమల్ నా లారీలో సరుకులు నింపించేడు. నేను బైల్దేరుతూ "తిరిగి త్వరలో కలుద్దాం" అన్నా. మా యూనిటెక్కడుందో చెప్పా.

ట్రక్కు సామాన్ల బరువుతో వెళుతూంటే నా మనసు కూడా ఆలోచనలతో బరువుగా వూగిస లాడుతోంది. ఎంత పని చేసేడు కమల్!

ఒక పెద్ద యుద్ధం మానవ జీవితపు బాటలో ఒక మలుపు దిద్దుతుంది. ఈ రెండో ప్రపంచ మహాయుద్ధం మానవుడి మనుగడలో కాళరాత్రి లాంటిది. తెల్లవారితే కొత్త మలుపు కాదు. కొత్త యుగమే ఆరంభమౌతుంది.

సీతని రావణాసురు డెత్తుకుపోయేడు. అప్పుడొక యుద్ధమైంది. అతిరథులు, మహారథులు సమక్షంలో, నిండు కొలువులో అంటరాని స్థితిలో వున్న ద్రౌపదిని నిలబెట్టి వివస్త్రని చేసేరు. ఆ కారణంగా ఒక మహాయుద్ధం జరిగింది. తరవాత యెన్నో యుద్ధాలు జరిగేయి. ఇంకా జరుగుతూనే వున్నాయి. ముందు కూడా జరగొచ్చు. యుద్ధం జరుగుతున్నప్పుడే మానవుడు ఘోరాలు చూసి జడుస్తాడు. మరి యుద్ధం వద్దు బాబో అనుకుంటాడు. యుద్ధం ముగిసి పోగానే కుక్కతోక తిరిగి వంకర. మానవ జీవితం ఒక ఎడతెగని యుద్ధం. శాంతి ఒక విరామం లాంటిది. నాటకంలో రంగానికీ, రంగానికీ మధ్య కిందికిజారే తెరలాంటిది. ఆ స్వల్ప విరామంలో కూడా తెరవెనక తతంగం జరుగుతూంటుంది. అది ప్రేక్షకులకి తెలీదు. నాటకం నడిపించేవాళ్ళకే తెలుసు!

మా ట్రక్కు వస్తూంటే కిటికీలోంచి చూసి ఓసీ బైటకొచ్చి ఎండలో నవ్వుతూ నిలబడ్డాడు.

“ఇది నిండుగా వుంది సర్” అన్నా, తలుపుతీసి ట్రక్కు దిగుతూ.

“రేషన్ స్టాండంతా మోసుకొచ్చినట్టుందే...” ఓ.సీ. అన్నాడు

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments